క్లుప్తంగా

వెన్న అలంకారంలో మంగరాయుడు



ఆదోని అర్బన్: పట్టణ శివారులోని మంగరాయ కాలనీలో వెలిసిన మంగరాయ ఆంజనేయస్వామి వారికి మంగళవారం భక్తులు వెన్న అలంకరణ చేశారు. ఆలయ మేనేజర్ కొప్రేష్‌ఆచార్ ఆధ్వర్యంలో పూజారులు గురురాజ, అక్షయ్‌లు భక్తులు ఇచ్చిన 4 కేజీల వెన్నతో మంగరాయ ఆంజనేయస్వామిని అలంకరించారు. ముందుగా స్వామివారికి పంచామృతాభిషేకం, తేనాభిషేకంతో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వేసవి శిబిరాన్ని సద్వినియోగం చేసుకోండి



గ్రంథాలయ అధికారి దుల్లయ్య

కోసిగి: కోసిగి గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నామని, విద్యార్థులు, యువకులు , పెద్దలు సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయ అధికారి దుల్లయ్య కోరారు. మంగళవారం స్థానిక గ్రంథాలయ కార్యాలయంలో విద్యార్థులకు గ్రంథాలయ పరిజ్ఞానంపై అవగాహన కల్పించారు. వేసవి సెలవుల్లో సమయం వృథా చేసుకోకుండా గ్రంథాలయానికి వచ్చి పాఠ్య పుస్తకాలు, నవలు, కథలు, జనరల్ నాలెడ్జ్ పుస్తకాలు చదువుకుని జ్ఞానం పెంచుకోవాలని సూచించారు. విద్యార్థులకు డ్రాయింగ్, పెయింటింగ్, క్యారమ్ బోర్డు, చదరంగం, తదితర పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు.

నీటి సరఫరాలో ఇబ్బంది లేకుండా చర్యలు



ఇందిరా నగర్‌లో ప్రజలతో మాట్లాడుతున్న కమిషనర్

ఎమ్మిగనూరుటౌన్: పట్టణ ప్రజలకు మంచి నీటి సరఫరాలో ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి మంగళవారం తెలిపారు. పట్టణంలోని ఇందిరానగర్‌లో మంచినీటి సమస్యపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. సంబంధిత సిబ్బందితో మాట్లాడి సమస్యను అక్కడిక్కడే పరిష్కరించారు.

అదుపు తప్పిన ఆర్టీసీ బస్సు




కంబలదిన్నె గ్రామంలో మురుగునీటి కుంటలో దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు

పెద్దకడబూరు : మండల పరిధిలోని కంబలదిన్నె గ్రామంలో రోడ్డు పక్కనే ఉన్న మురుగు నీటి కుంటలోకి ఆర్టీసీ బస్సు అదుపు తప్పి దూసుకెళ్లింది. మంగళవారం ఎమ్మిగనూరు పట్టణం నుంచి కోసిగి బయలు దేరిన ఆర్టీసీ బస్సు మండల పరిధిలోని కంబలదిన్నె గ్రామం వద్దకు రాగానే రోడ్డు సరీగా లేకపోవడంతో అదుపు తప్పి పక్కనే ఉన్న డ్రైనేజీ కుంటలోకి దూసుకెళ్లింది. దీంతో బస్సులో ప్రయాణిస్తున్న ఓ మహిళకు స్వల్ప గాయాలు అయ్యాయి. గ్రామస్తులు అందరూ మురుగు నీటిలో దిగిన బస్సును బయటకు తోశారు.

అక్రమ మద్యం స్వాధీనం

గోనెగండ్ల : మండల పరిధిలోని చిన్నమరివీడు గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న సుంకన్నను అరెస్టు చేసినట్లు సీఐ విజయ భాస్కర్ తెలిపారు. సీఐ తెలిపిన వివరాల మేరకు చిన్నమరివీడు గ్రామానికి చెందిన సుంకన్న కొంత కాలంగా గ్రామంలో అక్రమంగా మద్యం అమ్ముతున్నాడు. ఈ మేరకు పోలీసులకు సమాచారం అందడంతో మంగళవారం సాయంత్రం సుంకన్న ఇంటికి వెళ్లి సోదాలు చేయగా.. అక్కడ ఏపీకి చెందిన 16 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. అతనిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

కర్ణాటక మద్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్



పట్టుబడిన మద్యం, మోటార్‌సైకిల్‌ను చూపుతున్న ఎక్సైజ్ సీఐ సైదుల్

ఆదోని రూరల్: కౌతాళం మండలంలోని బదినేహాల్‌కు చెందిన కిందిగేరి ఈరన్న మంగళవారం అక్రమంగా కర్ణాటక మద్యాన్ని తరలిస్తుండగా పట్టుకున్నట్లు ఎక్సైజ్ సీఐ ఎస్.కె.జె.సైదుల్ తెలిపారు. సదరు వ్యక్తి వద్ద నుంచి టీవీఎస్ మోటార్ సైకిల్, 144 కర్ణాటక టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. ఎవరైనా అక్రమంగా కర్ణాటక మద్యాన్ని సరఫరా చేసినా, అమ్మినా అలాంటి వారిపై కేసులు నమోదు చేసి జైలుకు తరలిస్తామని హెచ్చరించారు.

రైతుల కష్టం.. వ్యాపారులకు లాభం

- మార్కెట్‌లో కూరగాయల హోల్‌సేల్ వ్యాపారుల దందా
- తక్కువ ధరకు కొని.. అధిక ధరకు విక్రయం
- తీవ్రంగా నష్టపోతున్న రైతులు, వినియోగదారులు
- పట్టణంలో రైతు బజార్ లేకపోవడంతోనే ఈ దుస్థితి



ఎమ్మిగనూరు వ్యవసాయ మార్కెట్‌లో హోల్ సేల్ కూరగాయల క్రయవిక్రయాలు జరుగుతున్న దృశ్యం

ఎమ్మిగనూరుటౌన్: ఆశల జూదంగా మారిన వ్యవసాయాన్ని నమ్ముకొని అప్పులు చేసి ఆరుగాలం కష్టించి కూరగాయలు పండించే రైతన్నలు హోల్ సేల్ మార్కెట్‌లో నిత్యం నష్టాలే చవిచూస్తున్నారు. ఎమ్మిగనూరు హోల్‌సేల్ కూరగాయల మార్కెట్‌లో రైతులు దిగుబడులను అమ్మబోతే అడవి... వాటిని కొనే ప్రజలకు కొరివి అన్నచందంగా మారింది. రైతులు పండించిన కూరగాయల పంట ఉత్పత్తులను నేరుగా ప్రజలకు విక్రయించేందుకు పట్టణంలో రైతు బజార్ లేకపోవడంతో వాటిని హోల్ సేల్ కమీషన్ ఏజెంట్లయిన వ్యాపారులకు వేలం ద్వారా విక్రయిస్తూ ఆర్థికంగా నష్టపోతున్నారు.

ఐదు వేల ఎకరాల్లో కూరగాయల సాగు..

ఎమ్మిగనూరు, మంత్రాలయం, కోడుమూరు నియోజకవర్గాల్లోని గ్రామాల్లో రైతులు వ్యవసాయ బోర్లు, బావుల కింద దాదాపు 5వేల ఎకరాలకు పైగా వివిధ రకాల కూరగాయలను రైతులు పండిస్తున్నారు. పండించిన దిగుబడులను ప్రతి రోజూ ఎమ్మిగనూరు మార్కెట్‌కు తీసుకొచ్చి హోల్‌సెల్ మార్కెట్‌లో కమీషన్ ఏజెంట్లకు వేలం ద్వారా విక్రయిస్తున్నారు. మార్కెట్‌కు నిత్యం బెండ, చెవుళకాయ, మిరప, వంకాయ, బెండకాయ, క్యాబేజీ, టమాట తదితర కూరగాయలను విక్రయానికి తెస్తే కమీషన్ ఏజెంట్లు, దళారులు తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ధరలపై దృష్టి సారించని అధికారులు

కమీషన్ ఏజెంట్లు రైతుల వద్ద కొనుగోలు చేసిన ధరలకంటే అధిక ధరలకు బహిరంగంగానే విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. నిత్యం హోల్ సెల్ మార్కెట్‌లో కమీషన్ ఏజెంట్లు, రిటైల్ వ్యాపారులు, కూరగాయలు విక్రయించే రైతుల నుంచి మార్కెట్ సిబ్బంది పన్నులు వసూలు చేసుకోవడం తప్ప కూరగాయల ధరల నియంత్రణపై దృష్టి సారించడం లేదు. తమకెందుకులే అన్న ధోరణిలో అధికారులు వ్యవహరిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు.

రైతు బజార్ ఏర్పాటు చేయాలి



వేలాది రుపాయల పెటుబడులు పెట్టి సాగు చేసి కూరగాయల దిగుబడులను విక్రయించేందుకు మార్కెట్ తెచ్చి అమ్ముకునే రైతులకు గిట్టుబాటు ధర లభించడం లేదు. కమీషన్ ఏజెంట్లు, వ్యాపారులు బాగుపడుతున్నారే కానీ ఇటు రైతులు, అటు కురగాయలు కొనుగోలు చేసే ప్రజలు నష్టపోతున్నారు. కూరగాయల ధరల నియంత్రణపై అధికారులు దృష్టి పెట్టాలి. అలాగే పట్టణంలో రైతు బజార్ ఏర్పాటు చేస్తే రైతులే తాము పండించిన కూరగాయల దిగుబడులు విక్రయించుకొని లాభ పడతారు.

– పంపన్న గౌడ్, రైతు సంఘు నాయకుడు

రైతుబజార్ ఏర్పాటు చేస్తే మేలు

తాము పండించిన కూరగాయల దిగుబడులను నేరుగా ప్రజలకు విక్రయించుకునేందుకు రైతు బజార్ లేక పోవడంతో ఒక వైపు తాము, మరోవైపు కొనుగోలు దారులైన ప్రజలు నష్టపోతున్నారని రైతులు పేర్కొంటున్నారు. అదే రైతుబజార్ సౌకర్యం వుంటే మధ్య దళారులు,క మీషన్ ఏజెంట్లు లేకుండా కూరగాయలను నేరుగా ప్రజలకు విక్రయించుకొనే అవకాశం వుంటుందని, ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవడం లేదని విమర్శిస్తున్నారు.

ఆర్డీటీ సేవలను కొనసాగించాలి

ఆదోని సెంట్రల్: రాయలసీమ ప్రజలకు వరప్రదాయినీగా మారిన ఆర్డీటీ సేవలను కొనసాగించాలని రాయలసీమ అభ్యుదయ విద్యార్థి ఫెడరేషన్ (ఆర్ఏవీఎఫ్) జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కృష్ణ ఖాజా కోరారు. మంగళవారం సాయంత్రం స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ (ఆర్డీటీ)కి విదేశీ నిధులు రాకుండా ఫారిన్ కంట్రీబ్యూషన్ రెగ్యులేషన్ యాక్ట్ (ఎఫ్‌సీఆర్ఏ)ను రెన్యూవల్ చేయకుండా అడ్డుకోవడం కేంద్రంలో బీజేపీకి తగదన్నారు. ఆర్డీటీని అడ్డుకోవడం అంటే పేద ప్రజల అభివృద్ధిని అడ్డుకోవడమేనన్నారు. కార్యక్రమంలో నాయకులు నాగరాజు, వీరేష్, రాగన్న, వలి తదితరులు పాల్గొన్నారు.

ఇంటి స్థలాల కోసం దరఖాస్తు చేసుకోండి

కౌతాళం: ఇంటి స్థలాలు లేని నిరుపేదలు స్థలాల కోసం దరఖాస్తులు చేసుకోవాలని తహసీల్దారు రజనీకాంత్‌రెడ్డి కోరారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు ఇంటి స్థలం లేని పేదలకు ప్రభుత్వం ఇంటి నివేశ స్థలం ఇస్తున్నదని, ఇందుకు గ్రామ సచివాలయంలో తమ దరఖాస్తు సమర్పించాలన్నారు. దరఖాస్తులపై విచారణ జరిపి అర్హులైన వారికి మంజూరు చేయడం జరుగుతుందన్నారు.

ఆదోని మున్సిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్దుతా

- తాత్కాలిక చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన ఎం.ఎం. గౌస్
- సన్మానించిన ఎమ్మెల్సీ, పాలకవర్గ సభ్యులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు



ఎమ్మెల్సీ, చైర్మన్, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రకాంత్‌రెడ్డిని సన్మానించిన పార్టీ నేతలు

ఆదోని టౌన్: ఆదోని మున్సిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్దుతానని తాత్కాలిక చైర్మన్ ఎంఎం గౌస్ అన్నారు. ఆదోని మున్సిపల్ తాత్కాలిక చైర్మన్‌గా ఎంఎం గౌస్‌ను నియమిస్తూ ఏపీ మున్సిపల్ పాలనాశాఖ కార్యదర్శి సోమవారం ఆదేశాలు జారీ చేయడంతో మంగళవారం ఆయన పదవీ బాధ్యతలు స్వీకరించారు. అనంతరం చైర్మన్ ఛాంబర్‌లో ఆయనను ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రకాంత్‌రెడ్డి, పాలకవర్గ సభ్యులతో కలిసి సత్కరించారు. ఆయన మాట్లాడుతూ.. తాను మున్సిపల్ చైర్మన్‌ను అవుతానని కలలో కూడా ఊహించలేదన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి, పాలకవర్గ సభ్యుల చొరవతో చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. దాదాపు ఏడాదిగా ఆదోని మున్సిపాలిటీలో స్తంభించిపోయిన సమస్యలు, ప్రజా సమస్యల పరిష్కారానికి తనవంతుగా కృషి చేస్తానని చెప్పారు.

ఆదోని నియోజకవర్గ అభివృద్ధే వైఎస్సార్‌సీపీ లక్ష్యం

ఆదోని నియోజకవర్గం అభివృద్ధే వైఎస్సార్‌సీపీ లక్ష్యమని ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్ అన్నారు. ప్రజా సమస్యలను పరిగణనలోకి తీసుకుని పార్టీలకు అతీతంగా పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. 11 నెలల కూటమి పాలనలో ఏ ఒక్కరికీ జరిగిందేమీ లేదన్నారు. అబద్ధాలు, కల్లిబొల్లి మాటలు, ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చడంలోనూ కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమయ్యిందని విమర్శించారు.

ఆగిన మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం పూర్తి చేస్తాం

పట్టణం నడిబొడ్డున పాత బస్టాండు సర్కిల్‌లో వ్యాపారుల గుడ్ విల్‌తో నిర్మిస్తున్న మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ పనులకు రాజకీయ గ్రహణం పట్టిందని, ఇకపై అన్ని సమస్యలను ఎదుర్కొంటూ కాంప్లెక్స్‌ను పూర్తి చేస్తామని వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రకాంత్‌రెడ్డి అన్నారు.. పట్టణాభివృద్ధిని కూటమి నేతలు అడ్డుకుంటున్నారని ఆరోపించారు. మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణాన్ని కూటమి నాయకులు ఎన్నో కుట్రలు పన్ని నిలిపివేయడం మంచి పద్ధతి కాదన్నారు. పార్టీలకు అతీతంగా అభివృద్ధి పనులు చేయాలే తప్పా కుంటి సాకులతో అభివృద్ధి పనులను అడ్డుకోవడం ఎంతవరకు సమంజసమని చంద్రకాంత్‌రెడ్డి ప్రశ్నించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు రఘునాథ్‌రెడ్డి, సందీప్‌రెడ్డి, కిషోర్, నగరూరు చంద్రశేఖర్‌రెడ్డి, మమ్మత్తుస్వామి, రామలింగేశ్వరయాదవ్, ఫయాజ్ అహ్మద్, నారాయణ, చలపతి, మధు, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేద్దాం



సన్మాన కార్యక్రమంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

- 83 ఏళ్ల తరువాత చైర్మన్ పీఠం ముస్లింలకు
- కౌన్సిలర్ల సహకారం మరువలేనిది
- మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

ఆదోని టౌన్: ఆదోని మున్సిపాలిటీలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడమే పరమావధిగా పని చేద్దామని, అందుకు అందరూ తమ వంతుగా సహాయ సహకారాలు అందించాలని మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి కోరారు. మంగళవారం రాత్రి ఎస్కేడీ కాలనీలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆదోని మున్సిపల్ ఇన్‌చార్జ్ చైర్మన్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన ఎంఎం గౌస్‌కు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పాలకవర్గ సభ్యుల విశ్వాసం, ప్రజల నమ్మకం కోల్పోవడంతోనే మున్సిపల్ చైర్‌పర్సన్ బోయ శాంతపై ఈనెల 16వ తేదీన అవిశ్వాస తీర్మానం పెట్టడం జరిగిందన్నారు. అందులోనూ వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు నెగ్గడం జరిగిందన్నారు. ఆదోని మున్సిపాలిటీ మున్సిపల్ చైర్మన్‌గా దాదాపు 83 ఏళ్ల క్రితం ముస్లింలు ఎన్నిక అయ్యారని, నేడు ఎంఎంగౌస్ చైర్మన్‌గా ఎన్నిక కావడం గర్వించదగ్గ విషయమన్నారు. కౌన్సిలర్ల సహకారం మరువలేనిదన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం ఆదోని మున్సిపాలిటీ అభివృద్ధి ఇక ఎంఎం గౌస్‌పైనే ఉందన్నారు. ఎవరెన్ని ప్రలోభాలు పెట్టినా 35 మంది కౌన్సిలర్లు తన మాట జవదాటలేదని, అందుకు వారికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు.

మాజీ ఎమ్మెల్యేకు సన్మానం

ఎంఎం గౌస్ మున్సిపల్ ఇన్‌చార్జ్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టడంతో మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి, ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రకాంత్‌రెడ్డిలను పట్టణ ముస్లింలు శాలువాలు కప్పి పూలమాలలు వేసి సన్మానించారు. కార్యక్రమంలో పట్టణంలోని ముస్లిం మైనార్టీలు, బంగారం, వెండి, వ్యాపారులు, బంగారు వ్యాపారుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

మంచి కవులుగా ఎదగాలి



చిన్నారులకు ప్రశంసా పత్రాలను అందజేస్తున్న దృశ్యం

పెద్దకడబూరు : చిన్నారులు భవిష్యత్‌లో మంచి కవులుగా ఎదిగాలని కర్నూలు జిల్లా కన్స్యూమర్ ఫోరం జడ్జి నరహరి నారాయణరెడ్డి అన్నారు. ఈనెల 30న శ్రీశ్రీ జయంతిని పురస్కరించుకొని 6వ తరగతి నుంచి డిగ్రీ విద్యార్థుల వరకు ఆదోనిలో శ్రీశ్రీ కవితా పఠన పోటీలను శ్రీశ్రీ కళావేదిక కర్నూలు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. పోటీల్లో పెద్దకడబూరు మండలం నుంచి ఉన్నత పాఠశాల విద్యార్థులు మనోజ్‌కుమార్, మేఘన, రైయిన్‌బో ప్రైవేట్ పాఠశాల విద్యార్థిని లావణ్య, వెంకటసాయి ప్రైవేట్ పాఠశాల విద్యార్థి కృష్ణ, ఆదర్శ పాఠశాల విద్యార్థులు నిహారిక, పవన్ కుమార్ పాల్గొని ప్రతిభ చూపారు. వీరికి జడ్జి చేతులమీదుగా ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో కవులు, ఉపాధ్యాయులు మశేకర్ నాగజ్యోతి, సువర్ణజ్యోషి, నాగేశ్వరరావు, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలు లేని సమాజాన్ని నిర్మిద్దాం



సైకిల్ యాత్రలో మాట్లాడుతున్న డీవైఎఫ్‌ఐ నాయకులు

ఆదోని రూరల్: మత్తు పదార్థాలు లేని సమాజాన్ని నిర్మించుకుందామని డీవైఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు రాఘవేంద్ర పిలుపునిచ్చారు. మంగళవారం డీవైఎఫ్ఐ ఆదోని పట్టణ కమిటీ ఆధ్వర్యంలో డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు వీరేష్, నాయకులు వెంకటేష్ నాయకత్వంలో డ్రగ్స్, గంజాయి, మత్తు పదార్థాలు, ఆన్‌లైన్‌లో బెట్టింగ్ యాప్‌లకు వ్యతిరేకంగా యువ చైతన్య సైకిల్ యాత్రను డీవైఎఫ్ఐ మాజీ జిల్లా నాయకులు లక్ష్మన్నతో కలిసి ప్రారంభించారు. వారు మాట్లాడుతూ మత్తు పదార్థాలు యువత భవిష్యత్‌ను నాశనం చేస్తున్నాయన్నారు. ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్ యువత పాలిట శాపంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. మహా నగరాల్లో పబ్బుల్లో రహస్యంగా దొరికే డ్రగ్స్, గంజాయి నేడు గ్రామాలకు కూడా విస్తరించాయన్నారు. డ్రగ్స్ బారిన పడకుండా యువత జాగ్రత్త పడాలన్నారు. యాత్రలో డీవైఎఫ్ఐ నాయకులు సతీష్, మోహన్, నవీన్, సూరి, జమీర్, సూరిబాబు, వీరబాబు, రవి, తరుణ్, శీను, రామానాయుడు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించే వరకు దీక్షలు



దీక్షలో కూర్చున్న ఆర్టీసీ కార్మికులు, యూనియన్ నాయకులు

ఆదోని టౌన్: ఆర్టీసీలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించేంతవరకు నిరాహార దీక్షలు కొనసాగుతాయని ఎస్ఎం యూఏ రీజినల్ కమిటీ సభ్యుడు ఫకృద్దీన్, నాయకులు హరబాబు, లక్ష్మన్న, ఆరోగ్యప్ప, రామలింగప్ప, షరీఫ్, బాలకృష్ణ, శేఖర్ తెలిపారు. రెండోరోజు మంగళవారం స్థానిక డిపో ముందు రిలే నిరాహారదీక్షలు కొనసాగాయి. యూనియన్ నాయకులు మాట్లాడుతూ 1/2019 భద్రతా సర్క్యులర్‌ను అమలు చేయాలన్నారు. ఉద్యోగులకు డబుల్ డ్యూటీ అమౌంట్ పెంచాలని, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు సంస్థ ద్వారా వేతనాలు పెంచాలన్నారు. దీక్షలో ఆర్టీసీ కార్మికులు మల్లికార్జున, గోవిందు, మాబుసాహెబ్, శ్రీహరి, హనుమంతులు కూర్చున్నారు.

తూకాల్లో తేడాలొస్తే చర్యలు



త్రాసులను తనిఖీ చేస్తున్న లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు

కోసిగి: దుకాణదారులు సరైన కొలతలతో వినియోగదారులకు వస్తువులను విక్రయించాలని, తూకాలు, కొలతల్లో తేడాలు వస్తే శాఖపరమైన చర్యలు తప్పవని లీగల్ మెట్రాలజీ (తూనికల కొలతల) ఇన్‌స్పెక్టర్ ఎం. శ్రీనివాసులు హెచ్చరించారు. మంగళవారం కోసిగిలోని పలు వ్యాపార దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేసి, త్రాసులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఎలక్ట్రానిక్ వేయింగ్ మిషన్‌లలో ఎలాంటి లోపాలు ఉండకూడదన్నారు. కాటాలకు ప్రతి ఏడాది ముద్ర, రాళ్ల తక్కెడలకు రెండు సంవత్సరాలకు ముద్ర వేయించుకోవాలన్నారు. మే నెలలో ముద్రలు వేయించుకోవాలని సూచించారు. ఇందులో సిబ్బంది లతీష్ బాషా ఉన్నారు.

కార్మికుల డిమాండ్లను పరిష్కరించాలి

ఆదోని టౌన్: మున్సిపాలిటీల్లో పనిచేసే కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు కోరారు. ఈ మేరకు మంగళవారం నిరవధిక సమ్మె నోటీసును మున్సిపల్ కమిషనర్ ఎం.కృష్ణకు అందజేశారు. వారు మాట్లాడుతూ అత్యవసర విభాగమైన నీటి సరఫరా, విద్యుత్ దీపాల కార్మికులకు కనీస వేతనం రూ.29,200, నాన్ టెక్నికల్‌కు రూ.24,500 అందించాలన్నారు.

నేడు బసవేశ్వర స్వామి జయంతి

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని తేరు బజారులోని బసవేశ్వర స్వామి ఆలయంలో బుధవారం బసవేశ్వర స్వామి జయంతి ఉత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు 1వ వార్డు మున్సిపల్ కౌన్సిలర్ కామర్తి నాగేశప్ప మంగళవారం తెలిపారు. స్వామి వారి జయంతి, పూజ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

విద్యార్థులను పై తరగతులకు ప్రమోట్ చేయాలి

ఎమ్మిగనూరుటౌన్: ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థులను పై తరగతులకు ప్రమోట్ చేసేందుకు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, యాజమాన్యాలు సత్వర చర్యలు తీసుకోవాలని ఎంఈఓలు ఆంజినేయులు, మధుసుదన్‌రాజు ఆదేశించారు. మంగళవారం వారు మాట్లాడుతూ.. ఇప్పటి వరకు 50శాతం మించి ఈ ప్రక్రియ జరగలేదని వంద శాతం పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే ఆర్‌టీఈ 12(1)సీ కింద పాఠశాలను రిజిస్ట్రేషన్ చేసుకోమని పలు మార్లు సూచించినా ప్రైవేట్ పాఠశాలలు పట్టించుకోవడం లేదన్నారు. ఈ విషయంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

మే డేను జయప్రదం చేయండి

గోనెగండ్ల: మేడే సందర్భంగా మండల కేంద్రం గోనెగండ్లలో శుక్రవారం నిర్వహించే వేడుకలను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పీఎస్ రాధాకృష్ణ పిలుపునిచ్చారు. మంగళవారం మండల కేంద్రం గోనెగండ్లలో వివిధ రంగాల సీఐటీయూ కార్మికులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రపంచ వ్యాప్తంగా కార్మికులు నిర్దిష్ట పని గంటల విధానం కోసం, పనికి తగ్గ వేతనం కోసం రక్తం చిందించి ప్రాణాలను అర్పించి హక్కులను సాధించుకున్న దినమే మేడే అని అన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు కరుణాకర్, నభి రసూల్, వేణు, రాఘవ, రఫీ తదితరులు పాల్గొన్నారు.

టెక్స్‌టైల్ పార్క్ స్థల పరిశీలన



బనవాసి వద్ద టెక్స్‌టైల్ పార్క్ స్థలాన్ని పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్, ఎమ్మెల్యే బీవీ

ఎమ్మిగనూరుటౌన్: మండల పరిధిలోని బనవాసి వద్ద టెక్స్‌టైల్ పార్క్ నిర్మాణానికి మే 1న సీఎం చంద్రబాబు నాయుడు వర్చువల్‌గా భూమి పూజ చేయనున్నందున, ఆ స్థలాన్ని మంగళవారం ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర్‌రెడ్డి, ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌తో కలిసి పరిశీలించారు. అనంతరం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో నియోజకవర్గంలోని పలు శాఖల అధికారులతో పలు అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో చేనేత జౌళి శాఖ ఏడీ నాగరాజారావు, తహసీల్దార్లు శేషఫణి, కుమారస్వామి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

పొరపాట్లకు తావు లేకుండా రీసర్వే చేయాలి

పొరపాట్లకు తావు లేకుండా భూముల రీసర్వే చేయాలని ఆదోని సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్ గ్రామ సచివాలయ, సర్వే సిబ్బందిని ఆదేశించారు. మండల పరిధిలో రీ సర్వే పైలెట్ ప్రాజెక్ట్ కింద ఎంపికైన కడిమెట్ల గ్రామంలో నిర్వహిస్తున్న రీ సర్వేను మంగళవారం ఆయన పరిశీలించారు. అనంతరం రీ సర్వే, రెవెన్యూ సంబంధించిన అంశాలపై గ్రామ సచివాలయంలో సంబంధిత రెవెన్యూ అధికారులతో సమీక్షించి పలు సూచనలిచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్ శేషఫణి, రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ జ్యోతీర్మయి, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికడదాం



మాట్లాడుతున్న ఎంపీడీఓ పుల్లయ్య

నందవరం: బాల్య వివాలను అరికట్టడం మన అందరి బాధ్యత అని తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీఓ పుల్లయ్య అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులతో బాల్యవివాహాల నిర్మూలనపై అంగన్‌వాడీ అధికారులతో కలిసి సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. గ్రామాల్లో బాల్య వివాహాలను అరికట్టేందుకు గ్రామస్థాయిలో పంచాయతీ కార్యదర్శి నేతృత్వంలో గ్రామ కమిటీలను ఏర్పాటు చేయాలన్నారు. వేసవి దృష్ట్యా పెళ్లి సీజన్ ప్రారంభం కావడంతో బాల్య వివాహాలు ఎక్కువగా జరిగే అవకాశం ఉందని, వాటి నిర్మూలన ప్రతి ఒక్కరూ సహకారించాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ రఘునాథ్, డిప్యూటీ ఎంపీడీఓ సందీప్, ఏపీఎం రాఘవేంద్ర, సీహెచ్ఓ బలరాముడు తదితరులు పాల్గొన్నారు.

బీమాను సద్వినియోగం చేసుకోవాలి

నందవరం : ఉపాధి కూలీలు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి జీవనజ్యోతి యోజనను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ పుల్లయ్య సూచించారు. మంగళవారం మండల కేంద్రంలో ఎంపీడీఓ ఉపాధి పనులను పరిశీలించారు. అనంతరం ఉపాధి కూలీలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ..జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరూ ప్రధాన మంత్రి జీవన జ్యోతి యోజన రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. వేసవి దృష్ట్యా ఉపాధి పనులు ఉదయం పూటే చేసుకోవాలని, కచ్చితమైన కొలతలతో పని చేస్తే రూ.307 రోజు వారి వేతనం చెల్లిస్తామని వివరించారు. కార్యక్రమంలో ఏపీఓ శ్రీనివాసులు, ఫీల్డ్ అసిస్టెంట్, మేట్లు పాల్గొన్నారు.

గడువులోపు లక్ష్యాలు పూర్తి చేయాలి

దేవనకొండ: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న గృహ నిర్మాణాలకు సంబంధించిన ప్రకియను జూన్ నాటికి పూర్తి చేయాలని హౌసింగ్ పీడీ చిరంజీవి సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం దేవనకొండలో గృహ నిర్మాణాల కోసం అర్జీ పెట్టుకున్న వారితో సమావేశమై మాట్లాడారు. గృహ నిర్మాణం చేపట్టడానికి ఎవరికి ఎలాంటి లంచాలు ఇవ్వకూడదని, సంబంధిత అధికారులు ఎవరైనా డబ్బులు అడిగితే తనదృష్టికి తేవాలన్నారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయంలో అసిస్టెంట్ ఇంజినీర్‌లతో సమావేశమయ్యారు. జిల్లాలో 11,706 ఇళ్లను జిల్లావ్యాప్తంగా నిర్మించాలన్నారు. సమావేశంలో గృహ నిర్మాణ శాఖ అసిస్టెంట్ ఇంజినీర్లు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.